ఇంటి ముంగిటకే విలువైన పత్రాలు

- జగనన్న సురక్షతో ఎంతో మేలు
- రూరల్ నియోజకవర్గంలో 6,054 మందికి సర్టిఫికెట్లు అందజేత

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరిగే ఇబ్బందులు లేకుండా 11 రకాల సేవలకు ఉచితంగా సత్వరమే అందించే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఎంతో ఆసరాగా నిలుస్తోంది. వలంటీర్లు ఇంటికి వచ్చి మరీ వివరాలు తీసుకుని గంటల వ్యవధిలోనే వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రూరల్ నియోజకవర్గంలోని తొర్రేడు -1, తొర్రేడు -2, హుకుంపేట -1, హుకుంపేట- 2, రాజవోలు -1, రాజవోలు -2, దుళ్ల -1, దుళ్ల - 2, మురమండ -1, మురమండ -2 గ్రామ సచివాయాల్లో గ్రామసభలు ముగిశాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 3,466 మందికి, కడియం మండలంలో 2,588 మందికి వివిధ రకాల పత్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. అధిక సంఖ్యలో ప్రజలు ఆధార్ అప్‌డేటేషన్, ఫోన్ నంబర్ యాడింగ్ సేవలు పొందారు.



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న కమిషనర్ దినేష్ కుమార్



దుళ్లలో పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ సుజాత

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయం, మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వలంటీర్ వచ్చి దరఖాస్తు తీసుకుని వివిధ రకాల పత్రాలను అందజేస్తున్నారు. ఇటువంటి మంచి కార్యక్రమం ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– తణుకుల వనజాక్షి, రాజవోలు

అర్హులందరికీ ధ్రువీకరణ పత్రాలు

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా అర్హులందరికీ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని కమిషనర్ కె.దినేష్ కుమార్ క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశించారు. మంగళవారం నగరంలో జరిగిన జగనన్న సురక్ష సభలను ఆయన సందర్శించారు. స్థానిక 9 నుంచి 11 సచివాలయాలకు దేవాంగ కమ్యూనిటీ హాల్లోనూ, 12 నుంచి 15 సచివాలయాలకు ప్రకాశం నగర్ సచివాలయంలోనూ, 16 నుంచి 19 సచివాలయాలకు విద్యుత్ కాలనీ సచివాలయంలో సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా వంద శాతం సంక్షేమ పథకాలు అందించాలన్నదే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సత్యవేణి, డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు, తహసీల్దార్ సుస్వాగతం, రెవెన్యూ అధికారులు సీహెచ్.శ్రీనివాసరావు, కేబీఆర్ రవికుమార్ పాల్గొన్నారు.

సురక్షతో సమస్యల పరిష్కారం

కడియం: క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వెంటనే పరిష్కారం లభిస్తోందని తహసీల్దార్ ఎం.సుజాత అన్నారు. ఆమె ఆధ్వర్యంలో దుళ్లలో, ఎంపీడీవో కె.రత్నకుమారి ఆధ్వర్యంలో మురమండలో అధికారుల బృందాలు పర్యటించాయి. లబ్ధిదారులకు పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశాయి. దుళ్లలో జరిగిన కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీటీసీలు కట్టుంగ నాగరాజు, పుత్సల బసవ శంకరం పాల్గొన్నారు.

ప్రజలకు ఒక వరం



జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు ఒక గొప్పవరం. నా పరిధిలో ఉన్న ప్రజలందరితోనూ అవసరమైన పత్రాల కోసం దరఖాస్తు చేయించాను. అందరికీ ఉచితంగా సర్టిఫికెట్లు అందజేశాం. ఇటువంటి కార్యక్రమంలో భాగస్వామి కావడం చాలా ఆనందంగా ఉంది. సీఎం జగనన్నకు అన్నివేళలా రుణపడి ఉంటాం.

– సందిపర్తి లావణ్య, వలంటీర్, డిబ్లాకు, హుకుంపేట

కుల ధ్రువీకరణ పత్రం అందింది



తూర్పుకాపు కుల ధ్రువీకరణ పత్రం కోసం రెండు సంవత్సరాలుగా మా అమ్మ జమ్ము లక్ష్మి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగింది. సర్టిఫికెట్ లేకపోవడంతో వైఎస్సార్ చేయూత పథకం వర్తించలేదు. జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసిన వెంటనే ధ్రువీకరణ పత్రం మా చేతికి ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది.

– జమ్ము రాజేశ్వరి, డిబ్లాక్, హుకుంపేట

క్లుప్తంగా

9న పుస్తకావిష్కరణ

సీటీఆర్ఐ: తాను రచించిన మనసున ఉన్నది పుస్తకావిష్కరణ కార్యక్రమం ఈనెల తొమ్మిదో తేదీన స్థానిక ధర్మంచర హాల్లో జరుగుతుందని రచయిత శ్రీపాద శ్రీనివాసు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. తన బాల్య స్నేహితుల సమక్షంలో, తనకు చదువు చెప్పిన మున్సిపల్ టౌన్ హైస్కూల్ ఉపాధ్యాయులతో ఈ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. తాను రచించిన గుండె చప్పుళ్లు, చట్టసభల్లో గోదావరి గళం పేరుతో రచించిన రెండు పుస్తకాలు విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకున్నాయన్నారు. తాజాగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుంచి తన స్వీయ రచన, వాయిస్‌తో ప్రసారం అయిన పలు కథలు, కథానికలు, పలు పత్రికలు, వెబ్ సైట్స్‌లో వచ్చిన తన రచనలను కూర్చి మనసున ఉన్నది పేరుతో ఓ పుస్తక రూపంలో తీసుకువచ్చానన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం



కడియం: కడియం - ద్వారపూడి రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలపై సుమారు 30 ఏళ్ల వ్యక్తి మృతదేహం లభ్యమైందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి ఒంటిపై నీలం రంగు టీ షర్టు, నలుపు షార్టు ఉన్నాయన్నారు. ఆచూకీ తెలిసిన వారు జీఆర్పీ స్టేషన్ 0883 2442821, 94914 44022కు సమాచారం ఇవ్వాలని కోరారు.

దోబీఘాట్‌లో..

స్థానిక దోబీఘాట్‌లో గుర్తు తెలియని సుమారు 40 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని రెండో పట్టణ పోలీసులు మంగళవారం కనుగొన్నారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

ఎంఈవోగా తులసీదాస్‌కు పూర్తి బాధ్యతలు



రాజమహేంద్రవరం రూరల్: ఏలేశ్వరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ రూరల్ మండల విద్యాశాఖాధికారి-1 ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఏఆర్‌కేడీ తులసీదాస్‌కు పదోన్నతి లభించింది. ఇటీవల జరిగిన కౌన్సిలింగ్‌లో ఆయనకు రూరల్ మండల విద్యాశాఖాధికారి-1గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఆయన రూరల్ మండలవిద్యాశాఖాధికారి-1గా పూర్తి బాధ్యతలు నిర్వహించనున్నారు.

ట్రాలీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

రాజానగరం: జాతీయ రహదారిపై గైట్ కాలేజీ సమీపంలో ఆగిన ట్రాలీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మంగళవారం రాజమహేంద్రవరం నుంచి కాకినాడకు స్టోన్స్ లోడుతో వెళుతున్న ట్రాలీ బ్రేకులు ఆకస్మాత్తుగా ఫెయిల్ అయ్యాయి. దీంతో ఆ ప్రాంతంలో నిలిపివేశారు. అదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి కాకినాడకు వెళ్తున్న నాన్‌స్టాప్ ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి వెనుక నుంచి ట్రాలీని ఢీకొంది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్‌కి స్వల్పగాయాలయ్యాయి. బస్సులోని 50 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

షాదీఖానా నిర్మాణానికి రూ.70 లక్షలు

సీతానగరం: ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో సీతానగరం మండలం ఇనుగంటివారిపేటలో షాదీఖానా, ఉర్దూ ఘర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.70 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం జీవో జారీ చేసింది. ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి, అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా నియోజకవర్గంలో పలు మసీదులు, ముస్లిం శ్మశానవాటికలకు ప్రహరీలు నిర్మించారు. రఘుదేవపురంలోని శ్మశాన వాటికను మెరక చేశారు. రాజానగరంలో ప్రహరీ నిర్మించారు. రాధేయపాలెంలో ప్రధాన రహదారి నుంచి మసీదులకు చేరుకోవడానికి వీలుగా రోడ్డు నిర్మించారు. నియోజకవర్గంలో వివిధ నిర్మాణాలకు సుమారు రూ. కోటి విలువైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి ఎమ్మెల్యే రాజా సమర్పించారు. నియోజకవర్గంలోని మసీదుల్లో ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం అందించడానికి ఎమ్మెల్యే రాజా కృషి చేశారు. కోవిడ్ సమయంలో పేద ముస్లింలకు జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్, వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందించారు.

మర్యాదపూర్వకంగా..



సీఎం జగన్‌ను కలిసిన అజ్జరపు వాసు

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం తాడేపల్లిలో మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ నాయకుడు అజ్జరపు వాసు మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని కలిసి పార్టీ విషయాలను వివరించారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ పంపిణీ



హైదరాబాద్‌లో భార్గవికి పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ బుంగారాజు

రాజమహేంద్రవరం రూరల్: ధవళేశ్వరం గ్రామసచివాలయం-5 పరిధిలోని దివ్యాంగురాలు ఎల్ఎస్ఎస్ భార్గవి వైద్య చికిత్స కోసం హైదరాబాద్‌లో ఉంటోంది. ఈ నేపథ్యంలో వలంటీర్ బుంగారాజు హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేశారు. ఆయనను పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు, తోటి వలంటీర్లు అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రంగంపేట: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం రంగంపేట మండలం సింగంపల్లి గ్రామానికి చెందిన యానాల సత్తిబాబు(48) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 3వ తేదీ ఉదయం 10 గంటలకు కుటుంబ సభ్యులతో బయటకి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు మామిడి తోటలో విగతజీవిగా కనిపించాడు. స్థానికుల సమాచారంతో మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ చెప్పారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం శివారున ఉన్న పామాయిల్ తోటలో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశామని ఎస్సై కె.చిరంజీవి మంగళవారం తెలిపారు. వారి నుంచి రూ. 5,840 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామని, వారిని కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

వంగవీటి రంగా ఆశయ సాధనకు కృషి

- స్మరించుకున్న వక్తలు
- ఘనంగా రంగా జయంత్యుత్సవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్వర్గీయ వంగవీటి మోహనరంగా ఆశయ సాధనకు కృషి చేస్తామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు, వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పేర్కొన్నారు. స్థానిక ట్రైనింగ్ కాలేజీ జంక్షన్‌లోని రంగా విగ్రహం వద్ద రంగా మిత్రమండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి మురళీ ఆధ్వర్యంలో మంగళవారం రంగా జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఆకుల వీర్రాజు, జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి రంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మానే దొరబాబు, నగర కాపు యువత అధ్యక్షుడు జవ్వాది సూర్య, ఉపాధ్యక్షుడు చక్రి నాయుడు, ఆకుల సతీష్ చంద్ర, లింగంపల్లి హరిబాబు, కంచి అప్పారావు, వక్కపాటి మురళి, దేశినీడి బలరామ నాయుడు, ఎం.ధర్మరాజు, పురంశెట్టి ప్రసాద్ నాయుడు, రాయుడు బాబ్జీ పాల్గొన్నారు.

సేవలు చిరస్మరణీయం

రాజమహేంద్రవరం రూరల్: వంగవీటి మోహన రంగా సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీగ్రీనింగ్అండ్‌బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. బొమ్మూరు నవభారత నగర్‌లో మోహనరంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి పార్టీ శ్రేణులకు



రంగా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు పార్టీ నాయకులు



పుస్తకాలు పంపిణీ చేస్తున్న జక్కంపూడి గణేష్

యెనుముల త్యాగరాజు, కేవీ సుబ్బారెడ్డి, సద్గుణ రామారెడ్డి, దాకే శ్రీను, తిరుపతి రాయుడు, సోమన శ్రీను, తోడేటి రాహుల్, వైఎస్ కుమార్, కాకులపాటి కుమార్, కొమ్మన కోటి పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: గ్రామంలోని బాలికల హైస్కూలు సెంటర్‌లో ఉన్న వంగవీటి మోహనరంగా విగ్రహం వద్ద మంగళవారం రంగారాధ మిత్ర మండలి సభ్యుడు, మాజీ ఉపసర్పంచ్ మెండా సత్తులు ఆధ్వర్యంలో రంగా జయంతి ఘనంగా నిర్వహించారు. సత్తులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి వంగవీటి మోహన రంగా చేసిన సేవలను కొనియాడారు. రంగా రాధ మిత్రమండలి సభ్యులు సాధనాల చంద్రశేఖర్(శివ), శ్రీరంగం బాలరాజు, మెండా రాజేష్ మాట్లాడుతూ రంగా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ తోరాటి ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్, మెండా రాజేష్ (చినబాబు), వడ్లమూడి కుమార్, యడ్ల మహేష్, మరిస్సా సూర్యప్రకాష్, ఏజీఆర్ నాయుడు పాల్గొన్నారు.



రంగా జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్



రంగా చిత్రపటానికి నమస్కరిస్తున్న రుడా చైర్ పర్సన్ షర్మిలారెడ్డి

సీటీఆర్ఐ: రంగా సేవలు చిరస్మరణీయమని రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. దేవీచౌక్‌లో కాపునాడు పార్లమెంట్ కార్యాలయంలో వంగవీటి మోహనరంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాపునాడు పార్లమెంట్ అధ్యక్షుడు గుదే రఘు నరేష్, నగర అధ్యక్షుడు ముమ్మిడి వీరబాబు, ఉపాధ్యక్షుడు ఎం.సునీల్ పాల్గొన్నారు.

కడియం మండలంలో..

కడియం: మండల కేంద్రమైన కడియంలో రంగా మిత్రమండలి ఆధ్వర్యంలో రంగా జయంతి నిర్వహించారు. స్థానిక నాయకులు గిరజాల వీర్రాజు (బాబు), వెలుగుబంటి రఘురామ్, ఆదిమూలం సాయిబాబా, పసల నాయుడు తదితరులు మాట్లాడుతూ రంగా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గిరజాల చిన బాబు, గంధం బాపూజీ, కొత్తూరి బాలనాగేశ్వరరావు, దొడ్డా బుజ్జి, శెట్టి సత్యనారాయణ, అడపా సుబ్రహ్మణ్యం, తోట ప్రసాద్, గొలుసు మణికంఠ, దుప్పలపూడి పెద్ద, దొడ్డా మణి, మందపల్లి సురేంద్ర పాల్గొన్నారు.

- అణగారిన వర్గాల వారి అభ్యున్నతికి పాటు పడిన వ్యక్తి వంగవీటి మోహనరంగా అని జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. గ్రామంలో రంగా చిత్రపటానికి సర్పంచ్ స్టాలిన్, ఉపసర్పంచ్ పాతూరి రాజేష్ పుష్పాంజలి ఘటించారు. అనంతరం రంగా, జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహాల ఏర్పాటుకు కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జనార్దనస్వామి ఆలయ చైర్మన్ పేపకాయల సత్యనారాయణ, వార్డు సభ్యులు మాదారపు సూరిబాబు, పెరుగు నాగేశ్వరరావు, పుట్టా బుజ్జి, పైడిముక్కల రఘు, దుడే శివ పాల్గొన్నారు.

మన పథకాలు దేశానికే ఆదర్శం



గడపగడపకూ మన ప్రభుత్వంలో పథకాలను వివరిస్తున్న చందన నాగేశ్వర్

- కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- ఉత్సాహంగా గడపగడపకూ..

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్అండ్‌బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మంగళవారం సాయంత్రం బొమ్మూరు గ్రామసచివాలయం-4లోని నవభారత్ నగర్, టీచర్స్ కాలనీ, ఏసీబీ కాలనీ, ఇంజినీర్స్ కాలనీ, నేతాజీ నగర్ ప్రాంతాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లు పంపిణీ చేశారు. స్థానికులు తెలిసిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చందన నాగేశ్వర్ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలు ఇంటి ముంగిటకే అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, సచివాలయ కన్వీనర్లు కేవీ సుబ్బారెడ్డి, తిరుపతి రాయుడు, పార్టీ నాయకులు సద్గుణ రామారెడ్డి, దాకే శ్రీనివాస్, సోమన శ్రీనివాస్, వైఎస్ కుమార్, తోడేటి రాహుల్, కాకులపాటి కుమార్, కొమ్మన కోటి, పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అల్లూరి జీవితం అందరికీ ఆదర్శం

- కొనియాడిన వక్తలు
- మన్యం వీరుడికి ఘనంగా నివాళి

సీటీఆర్ఐ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం అందరికీ ఆదర్శమని వక్తలు కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా మంగళవారం పలుచోట్ల ఘనంగా నివాళులర్పించారు. రాజమహేంద్రవరం రామాలయం జంక్షన్‌లోని కాంస్య విగ్రహానికి క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి హాజరయ్యారు.

- బీజేపీ అర్బన్ అసెంబ్లీ కన్వీనర్ యెనుముల రంగారావు ఆధ్వర్యంలో దేవీచౌక్ అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీస్ ఫర్ పీపుల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వర నగర్‌లోని జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేశారు.

కడియం: స్థానిక శాఖా గ్రంథాలయంలో శెట్టిపల్లి శ్రీదేవినిర్మల ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో చరిత్ర విభాగం ఆధ్వర్యంలో అల్లూరి జయంతి నిర్వహించారు. శాఖాధిపతి పుష్పాంజలి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ వసుధ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర కారాగారంలో అల్లూరి జయంతి నిర్వహిస్తున్న జైలు అధికారులు

కేంద్రకారాగారంలో..

కంబాలచెరువు: కేంద్ర కారాగారంలో జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజకుమార్, బి.రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

- ఆచార్య ఎన్‌జీ.రంగా వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ చవన్ శ్యామ్‌రాజ్ నాయక్ మాట్లాడుతూ అల్లూరి త్యాగం చిరస్మరణీయమన్నారు. కంటిపూడి రామారావు మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పి.దుర్గాప్రసాద్, వికాస తరంగిణి శాఖ అధ్యక్షురాలు పద్మావతి రామనుజన్ తదితరులు పాల్గొన్నారు.



కంటిపూడి మున్సిపల్ హైస్కూల్లో..

ధవళేశ్వరం: ధవళేశ్వరం మసీదు సెంటర్‌లో యువజన సంక్షేమ గౌరవ అధ్యక్షుడు మెండా సత్తులు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు.

జగనన్న సురక్షను వినియోగించుకోండి

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న సురక్ష పథకంలో లబ్ధిదారులకు ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నామని వైఎస్సార్‌సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీగ్రీనింగ్అండ్‌బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మంగళవారం రాజవోలు గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో చందన నాగేశ్వర్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ అర్హులందరికీ అవసరమైన సర్టిఫికెట్లు త్వరితగతిన అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, టూరిజం డెవలప్‌మెంట్ ఆఫీసర్ స్వామినాయుడు, మండల ప్రత్యేకాధికారి, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎన్ జ్యోతి, తహసీల్దార్ పైడి చిన్నారావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్అండ్ఆర్డీ టి.కృష్ణ, ఏఎస్‌వో రామం, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, మాజీ ఎంపీటీసీ నక్కా శ్యాంబాబు పాల్గొన్నారు.


- తొర్రేడు సచివాలయం-2లో జరిగిన జగనన్న సురక్ష గ్రామసభలో 649 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ రత్నసాగర్, ఎంఈవో -2 చందుకుమార్, సచివాలయ కన్వీనర్లు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు పాల్గొన్నారు.
- హుకుంపేట-2 సచివాలయం డిబ్లాకులో జరిగిన గ్రామసభలో కలెక్టర్ డా.మాధవీలత, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పాల్గొన్నారు.వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.



హుకుంపేటలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత, చందన నాగేశ్వర్

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. రోగుల అవస్థలు

సాక్షి, రాజమహేంద్రవరం: కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రాజమహేంద్రవరం సర్వజన ప్రభుత్వాస్పత్రిలో విద్యుత్ కోతతో రోగులు ఇబ్బంది పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ సరఫరాలో అంతరాయం కలిగింది. కాంట్రాక్టరు, అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ప్రభుత్వ ఆస్పత్రి బోధనాస్పత్రిగా రూపాంతరం చెందిన నేపథ్యంలో పలు విద్యుత్ సంబంధ పనులు చేపడుతున్నారు. కాంట్రాక్టర్ ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా విద్యుత్ కోత విధించి పనులు చేపట్టారు. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జనరేటర్ల ద్వారా విద్యుత్ అందించే లైన్లు ఏర్పాటు చేసుకోలేదు. రోగులు ఉక్కపోతతో అల్లాడిపోయారు. దీంతో హుటాహుటిన మరమ్మతులు చేపట్టి రాత్రి 8 గంటల సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.



సెల్‌ఫోన్ వెలుగులో విధులు నిర్వర్తిస్తున్న నర్సులు



చీకట్లో రోగుల ఇబ్బందులు